సాక్షి నంద్యాల

గురువారం । 16 । మార్చి । 2023



ఆదిదంపతులకు ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో బుధవారం మూలనక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీభ్రమరాంబాదేవి, మల్లికార్జున స్వామి వార్లకు వేద పండితులు ఊయలసేవ నిర్వహించారు.



సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి బుధవారం 890 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 0.845 టీఎంసీల నీరు ఉండగా కేసీ కాల్వకు 505 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఉష్ణోగ్రతలు

కనిష్టం	20.04
గరిష్టం	38.00

ఎమ్మెల్సీ తీర్పు నేడే

- కొన్ని గంటల్లోనే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో కౌంటింగ్ కేంద్రం
- రెండు టేబుళ్ల ఏర్పాటు.. ఒక్క రౌండ్‌లోనే తేలనున్న ఫలితం
- అనంతపురంలో గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్



'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు సిల్వర్‌జూబ్లీ కళాశాలలో ఏర్పాట్లు చేసిన దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ఉత్కంఠకు కొన్ని గంటల్లోనే తెరపడనుంది.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ విజేత ఎవరో గురువారం తేలనుంది. అలాగే గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీలుగా ఎవరు గెలవనున్నారో కూడా దాదాపు తెలిసిపోతుంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ, కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 13వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లాలో పోలింగ్ నిర్వహించారు. పట్టభద్ర, ఉపాధ్యాయ బ్యాలెట్ బాక్సులను అనంతపురానికి పంపించి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బ్యాలెట్ బాక్సులను కర్నూలులోని సిల్వర్‌జూబ్లీ కాలేజీలో ఉంచారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్ కేంద్రాన్ని కర్నూలులోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేశారు. ఇక్కడే ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. ఇందుకోసం రెండు టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కిస్తారు. తరువాత బ్యాలెట్ బాక్సుల్లో బ్యాలెట్ పేపర్లన్నింటినీ ఒక బాక్సులో కలిపి రెండు టేబుళ్లకు సమానంగా బ్యాలెట్ పేపర్లను విభజించి అభ్యర్థుల వారీగా లెక్కిస్తారు.

గెలుపు ఏకపక్షమే!

స్థానిక సంస్థల ఎమ్మెల్సీల్లో గెలుపు ఏకపక్షమే అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీకి పూర్తి బలం ఉండగా, బలం లేకున్నా టీడీపీ మద్దతుదారులైన ఇద్దరు సర్పంచులు ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలిచారు. దీంతో ఏకగ్రీవం కావాల్సిన చోట పోటీ అనివార్యమైంది. ఈ క్రమంలో మార్చి 13వ తేదీన పోలింగ్ జరిగింది.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ

మొత్తం 1,178 మంది స్థానిక ప్రజాప్రతినిధుల్లో 1,136 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కౌంటింగ్ గురువారం జరగనుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన డాక్టర్ ఎ. మధుసూదన్ విజయం నల్లేరుపై నడకేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన

సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఓట్ల లెక్కింపు, ఇతర ఏర్పాట్లపై నోడల్ ఆఫీసర్లు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డితో చర్చించారు. అంతకుముందు స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. ఆయన వెంట కర్నూలు, కల్లూరు తహసీల్దార్లు శివరాముడు, రమేష్‌బాబు ఉన్నారు.

ఉత్కంఠను రేపుతున్న గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు గురువారం అనంతపురం జేఎన్‌టీయూలో జరగనుంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులతోపాటు వారి అనుచరులు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో పట్టభద్రులకు సంబంధించి 61,633 మంది ఓటర్లకుగాను 43,944 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఉపాధ్యాయులకు సంబంధించి 5,391 మందికిగాను 4,868 మంది ఓటర్లు ఓటేశారు. పట్టభద్రుల స్థానానికి ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో మొదటి రోజు ఫలితం తేలే అవకాశం దాదాపుగా ఉండదు. మొదటి ప్రాధాన్యత ఓటుతోనే అభ్యర్థి గెలుపొందితే శుక్రవారం నాటికి ఫలితం వచ్చే అవకాశం ఉంది. లేదంటే మరో ఒకటి, రెండు రోజులు ఫలితాల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. కాగా, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం రెండో రోజులోపు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఓట్ల లెక్కింపు ఇలా..

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యత ఓటు ఉండడంతో మొదట అన్ని బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను ఓ డ్రమ్ములో కుమ్మరించి కలిపేస్తారు.
- ఏ పోలింగ్ స్టేషన్‌లో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో తెలిసే అవకాశం ఏ మాత్రం ఉండదు.
- అభ్యర్థి గెలుపునకు చెల్లిన ఓట్లలో సగం కంటే ఒకటి ఎక్కువ రావాలి.
- తొలుత మొదటి ప్రాధాన్యత ఓట్లను ఎవరికీ ఎన్ని వస్తాయో లెక్కిస్తారు. వీటిలో చెల్లిన ఓట్లలో సగం కంటే ఒకటి ఎక్కువగా ఏ అభ్యర్థికైనా వస్తే ఆయనను గెలిచినట్లుగా ప్రకటిస్తారు. అప్పుడు 2,3,4,5...ప్రాధాన్యత ఓట్లను లెక్కించరు.
- మొదటి ప్రాధ్యానత ఓట్లు ఎవరికీ సగం+1 రాకపోతే అందరి కంటే తక్కువ మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చిన వారిని తొలగిస్తారు. అతని రెండో ప్రాధాన్యత ఓట్లను మిగిలిన వారికి ఎవరికెన్ని వచ్చాయో లెక్కించి కలుపుతారు. ఇప్పుడు ఏ అభ్యర్థికైనా సగం+1వస్తే అతన్ని గెలిచినట్లు ప్రకటిస్తారు. దీంతో ఓట్ల లెక్కింపు ముగుస్తుంది.
- అప్పటికీ సగం+1 రాకపోతే ఆ తరువాత తక్కువ ఓట్లువచ్చిన వారిని తప్పించి అతని రెండో ప్రాధాన్యత ఓట్లను మిగిలిన వారికి ఎవరికెన్ని వచ్చాయో లెక్కించి కలుపుతారు. అప్పటికీ ఎవరికీ సగం+1 రాకపోతే ఎలిమినేట్ అయిన ఇద్దరి మూడో ప్రాధాన్యత ఓట్లు కూడా లెక్కించి పై వారికి కలుపుతారు.
- ఇలా సగం +1 వచ్చే వరకు కింది నుంచి తక్కువ ఓట్లు వచ్చిన వారి 2,3,4,... ఓట్లను ఇలా ఒక ప్రక్రియలో కలుపుకుంటూ పోతారు.
- చివరి దాకా సగం+1 రాకపోతే ఎలిమినేట్ కాని చివరి అభ్యర్థిని గెలిచినట్లు ప్రకటిస్తారు.

ఏసీబీ వలలో సీనియర్ అసిస్టెంట్

- రూ.3 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన జిల్లా రిజిస్ట్రార్ ఉద్యోగి



లంచం తీసుకుంటూ పట్టుబడిన మహబూబ్‌బాషా

కర్నూలు(సెంట్రల్): లంచం ఇవ్వనిదే ఏ పని చేయనన్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్. మహబూబ్ బాషాను ఏసీబీ(యాంటీ కరప్షన్ బ్యూరో) వల పన్ని పట్టుకుంది. రూ.3 వేలు లంచం తీసుకుంటుండగా కేసు నమోదు చేసి జైలుకు పంపింది. వివరాలివీ.. కర్నూలులోని కొత్తపేటకు చెందిన పి.మన్సూర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ స్థాపనకు ఫర్మ్ రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో మార్చి 7వ తేదీన దరఖాస్తు చేశాడు. ఆ ఫైల్ ఎస్.మహబూబ్ బాషా దగ్గరకు వెళ్లింది. దీంతో ఆయన మన్సూర్‌ను పిలిచి ఫైల్ ప్రాసెస్‌కు రూ.3 వేలు లంచం ఇవ్వాలని కోరాడు. అన్నీ సక్రమంగా ఉన్నాయని, డబ్బు ఎందుకు ఇవ్వాలని ఆయన అధికారిని ప్రశ్నించాడు. అయితే 2023 జనవరి 22వ తేదీన కూడా ఓసారి దరఖాస్తు చేయగా డబ్బు ఇవ్వకపోవడంతో ఫైల్‌ను రిజెక్ట్ చేసిన విషయాన్ని మహబూబ్‌బాషా గుర్తు చేశాడు. ఇప్పుడు కూడా అదే జరుగుతుందన్నాడు. దీంతో బాధితుడు 14400 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదుచేశాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు మహబూబ్‌బాషా బుధవారం మధ్యాహ్నం డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. దాడుల్లో ఏసీబీ అధికారులు వంశీ, వెంకటస్వామి, ఇంతియాజ్ బాష, హరికృష్ణ పాల్గొన్నారు.

డబ్బు డిమాండ్ చేస్తే 14400కు ఫోన్ చేయండి

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు పనుల కోసం డబ్బు డిమాండ్ చేస్తే 14400 కాల్ సెంటర్‌ను ఆశ్రయించాలని ఏసీబీ అధికారి తేజేశ్వరరావు సూచించారు. కొత్తగా 14400 మొబైల్ యాప్ కూడా అందుబాటులో ఉందని, దానిని డౌన్‌లోడ్ చేసుకొని లంచాలు తీసుకుంటున్న అధికారుల ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసినా విచారణ జరుపుతామన్నారు.

న్యూస్‌రీల్

శ్రీశైల భక్తులకు ప్రథమ చికిత్సా కేంద్రాలు



శ్రీశైల భక్తులకు వైద్యశిబిరం ప్రారంభిస్తున్న డాక్టర్ కేజీ గోవిందరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): శ్రీశైలం వెళ్లే కర్ణాటక భక్తుల కోసం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పలు చోట్ల ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి చెప్పారు. బుధవారం నగర సమీపంలోని వెంకాయపల్లె దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్సా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందవరం మండలం సోమలగూడూరు, నల్లమల అడవి ప్రాంతంలో పెద్ద చెరువు దగ్గర, శ్రీశైలం పరిసరాల్లో, కైలాస ద్వారం, నందిమండపం వద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కాళ్లకు బొబ్బల గాయాలు, నొప్పులతో బాధపడుతున్న వారికి ప్రథమ చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. 20 ఏళ్లుగా ఇలాంటి శిబిరాలు కొనసాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్యశిబిరం ఐదు రోజుల పాటు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, జి.శ్రీనివాసయాదవ్, మధుసూదన్, అరుణ, డీఎఫ్ఓ రమేష్ పాల్గొన్నారు.

18న వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూ

బొమ్మలసత్రం: మెడికల్ కళాశాల, సర్వజన ఆసుపత్రిలో సీనియర్ రెసిడెంట్ వైద్యుల నియామకాలకు ఈనెల 18న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి. స్వర్ణలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఓబీజీ, అనస్తీషియా, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ, రేడియాలజీ, ఎమర్జెన్సీ, మెడిసిన్ తదితర విభాగాల్లో నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పది మార్క్‌లిస్ట్, ఎంబీబీఎస్, పీజీ డిగ్రీ, రిజిస్ట్రేషన్, పీజీ మార్కులిస్ట్, సోషల్ స్టేటస్, ఆధార్‌తో పాటు 4వ తరగతి నుంచి నుంచి ఇంటర్ వరకు సర్టిఫికెట్ తీసుకుని ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

సేవలతోనే పగిడ్యాల పీఏసీఎస్‌కు గుర్తింపు



మాట్లాడుతున్న సీఈఓ రామాంజనేయులు

పగిడ్యాల: మల్టీ సర్వీస్ సెంటర్‌గా పగిడ్యాల పీఏసీఎస్ రైతులకు అందిస్తున్న సేవలతో ఎంతో గుర్తింపు పొందుతుందని కేడీసీసీ బ్యాంక్ సీఈఓ రామాంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక సహకార సొసైటీ చైర్మన్ శిరిగిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన రైతులకు కామన్ వెల్త్ ఆఫ్ లెర్నింగ్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ జీవన ప్రమాణాల మెరుగుకు అవసరమైన సలహాలు, సూచనలను వారి మొబైల్ నంబర్లకు వాయిస్ మెసేజ్ ద్వారా అందించనున్నట్లు తెలిపారు. కెనడా సహకారంతో పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో పగిడ్యాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే ఈ సొసైటీ ద్వారా సభ్యులకు వివిధ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని మరింత ఆర్థికంగా ఎదిగేందుకు వాయిస్ మెసేజ్ సమాచారం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆప్కాబ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ భరద్వాజ్ శర్మ, నందికొట్కూరు బ్యాంక్ మేనేజర్ కె. సరోజమ్మ, ఫిసరీస్ అసిస్టెంట్ చంద్రమోహన్, తదితరులు ఉన్నారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినులు



నంద్యాలలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మొదటి రోజు 1,231 మంది విద్యార్థుల గైర్హాజరు

- 17 కేంద్రాలకు ప్రత్యేక రవాణా సౌకర్యం
- స్క్వాడ్ బృందాల తనిఖీల్లో ఓ విద్యార్థి డిబార్
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



కర్నూలులోని టౌన్‌మోడల్ కాలేజీలో పరీక్ష రాసేందుకు సిద్ధమైన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు

నంద్యాల సిటీ: ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి పరీక్ష కావడంతో విద్యార్థులు తమ హాల్ టికెట్లతో ఆలయాల్లో పూజలు చేయించుకొని తల్లిదండ్రుల ఆశీర్వాదంతో గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. 8.15 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. నిర్దేశించిన సమయం 9 గంటలకు పరీక్షలు మొదలయ్యాయి. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమనే నిబంధనతో అక్కడక్కడ కొందరు విద్యార్థులు ఇబ్బందులకు లోనయ్యారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఏపీ ప్రజా రవాణా సంస్థ ఉమ్మడి జిల్లాలో 17 కేంద్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఇక అధికారులు పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స సదుపాయాలు, బెంచీలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఇదిలాఉంటే కర్నూలులోని పలు కార్పొరేట్ కాలేజీల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన చోట సెకండియర్ విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించడం గమనార్హం.

1,231 మంది విద్యార్థులు గైర్హాజరు

ఉమ్మడి జిల్లాలో 283 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 3,068 మందిలో 31,033 మంది హాజరు 103 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 3,009 మందిలో 2,813 మంది పరీక్ష రాయగా.. 196 మంది గైర్హాజరయ్యారు. మొదటి రోజు తుగ్గలిలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైంది. ఆర్‌ఐఓ గురవయ్యశెట్టి నాలుగు కేంద్రాలు, కర్నూలు, నంద్యాల డీవీఈఓలు 10 కేంద్రాలు, హైపవర్ కమిటీ 6 కేంద్రాలు, డీఈసీ కమిటీ 9 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 29 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 12 కేంద్రాలను తనిఖీ చేశారు.

ఏర్పాట్ల పరిశీలన

బొమ్మలసత్రం: ఇంటర్ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే విద్యార్థులకు వసతుల కల్పన విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఉన్న 51 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్, ఎస్పీల వెంట డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐలు, ఎస్‌ఐలు ఉన్నారు.

సన్న వరి.. రైతుకు సిరి

- మార్కెట్‌లో నంద్యాల సోనకు డిమాండ్
- పోటీ పడుతున్న వ్యాపారులు
- ప్రభుత్వ మద్దతు ధరకు మించి కొనుగోలు
- బస్తా రూ. 2600 వరకు పలుకుతున్న ధర
- జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 61.10 లక్షల బస్తాల దిగుబడి

ఆళ్లగడ్డ: ఈ ఏడాది సన్న వరి (నంద్యాల సోన) పంట రైతులకు సిరులు కురిపిస్తోంది. మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో వ్యాపారులు పోటీ పడి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రకృతి అనుకూలించి ఈ సారి దిగుబడులు పెరగడం, దానికితోడు మంచి ధర లభిస్తుండటంతో రైతులు ఉబ్బితబ్బిబవుతున్నారు.

మద్దతుకు మించి..

సన్న వరి ధాన్యానికి మద్దతు ధర కంటే అధికంగా ధర చెల్లిస్తూ ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం 'ఏ' గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ. 2060, సాధారణ రకానికి రూ. 2040 చొప్పున ధర ప్రకటించింది. 75 కిలోల బస్తా 'ఏ' గ్రేడ్ రకానికి రూ 1545, సాధారణ గ్రేడ్‌కు రూ. 1530 ధర ఉంది. డిమాండ్ పెరగడంతో బహిరంగ మార్కెట్‌లో 75 కిలోల బస్తా ధాన్యం రూ. 1650 నుంచి మొదలై ఇప్పుడు రూ. 2600కు చేరింది.

రైతులకు ముందస్తు అడ్వాన్స్‌లు

జిల్లాలో ఈ ఏడాది కేసీ కెనాల్, తెలుగు గంగ కాల్వలతో పాటు చెరువులు, బోర్ల కింద ఖరీఫ్ సీజన్‌లో 67,890 హెక్టార్లలో వరి సాగు అయింది. అధికారుల అంచనాల ప్రకారం మొత్తం 61,10,100 బస్తాల దిగుబడి వచ్చింది. ఎకరాకు సగటున 35 నుంచి 40 బస్తాలు వరకు దిగుబడులు వచ్చాయి. సన్న వరికి దేశంలో విపరీతమైన డిమాండ్ ఉండటంతో వ్యాపారులు ధర ఎక్కువైనా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది ఎక్కువగా తెలంగాణ, ముంబయి, తమిళనాడు, ఢిల్లీ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు నంద్యాల, ఆళ్లగడ్డకు వచ్చి మధ్య వర్తుల ద్వారా వరి రైతులను కలిసి అడ్వాన్స్ చెల్లిస్తున్నారు. రుద్రవరం తదితర మండలాల్లో 75 కిలోల బస్తాకు బహిరంగ మార్కెట్ ధర కంటే రూ. 200 అదనంగా ఇస్తున్నారు. కొందరు రైతులు తాము పండించిన వడ్లను మర పట్టించి బియ్యంగా మార్చి విక్రయిస్తున్నారు. ఇందులో కల్తీకి అవకాశం ఉండదు కనుక వినియోగదారులు రైతుల వద్ద కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

డిమాండ్ పెరగడంతోనే..

మన దేశం నుంచి ధాన్యం విదేశాలకు ఎగుమతి చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించడంతో బియ్యం ఎగుమతులు పెరిగాయి. దీనికి తోడు దేశవ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణం తగ్గడంతో దిగుబడులపై ప్రభావం పడింది. దీంతో సన్నరకం బియ్యానికి దేశీయంగా కూడా డిమాండ్ పెరిగింది. కొందరు నంద్యాల, ఆళ్లగడ్డ ప్రాంతంలోని పండించిన రైస్‌ను నంద్యాల సోన అని రాసి దేశంలోని ప్రధాన నగరాల్లో విక్రయిస్తున్నారు.

గతంలో ఇంత ధర లేదు



కేసీ కెనాల్ కింద 25 ఎకరాల్లో సన్న వరి సాగు చేశా. సుమారు 2000 బస్తాలు దిగుబడి వచ్చింది. రూ. 2,200 లెక్కన 1000 బస్తాలు అమ్ముకున్నా. ధర డిమాండ్ ఉండటంతో వెయ్యి బస్తాలు స్టాక్ పెట్టుకున్నా. వీటికి కూడా ఎంతకిస్తావో చెప్పు అని వ్యాపారులు వస్తున్నారు. గతంలో ఇంత డిమాండ్ ఎప్పుడు చూడలేదు.

– తిరుపతి రెడ్డి, రైతు, వెంకటాపురం, శిరివెళ్ల మండలం

రైతులకు అండగా ప్రభుత్వం



రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా వరి ధాన్యానికి పెద్ద ఎత్తున మద్దతు ధర ప్రకటించింది. దీంతో వ్యాపారులు పోటీపడి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులకు ధాన్యం విక్రయ సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. – మోహన్‌రావు, జిల్లా వ్యవశాయశాఖ అధికారి



వడ్లను లారీకి లోడ్ చేస్తున్న దృశ్యం

నీట్‌లో మెరిసిన రైతుబిడ్డలు

- పీజీ మెడిసిన్‌లో ర్యాంకులు



డాక్టర్ రజియా



డాక్టర్ సుష్మ

మహానంది: నీట్ పీజీ ఫలితాల్లో రైతు బిడ్డలు ప్రతిభ చూపారు. మంగళవారం సాయంత్రం వచ్చిన ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన చెన్నూరు హుసేని, చెన్నూరు హుసేనమ్మలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి రెండో కుమార్తె రజియా అనంతపురం ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ చేయాలన్న సంకల్పంతో నీట్ పరీక్షలు రాయగా 571 మార్కులు వచ్చాయి. ఆలిండియా స్థాయిలో 5248వ ర్యాంకు వచ్చింది. చిన్నపిల్లల వైద్యనిపుణురాలిగా మంచి పేరు తెచ్చుకుని పేదలకు సేవచేయాలన్నదే తన లక్ష్యమని ఈమె తెలిపారు.

జనరల్ మెడిసిన్‌లో..

మహానంది మండలం అల్లీనగరం గ్రామానికి చెందిన దూదేకుల చిన్నమాబు ఉసేని, ఆశాబేగం వ్యవసాయం చేస్తూ కుమార్తె సుష్మను కర్నూలు మెడికల్ కళాశాలలో చదివించారు. ఎంబీబీఎస్ పూర్తయిన వెంటనే నీట్ పీజీ పరీక్షలు రాయగా సుష్మకు 619 మార్కులు వచ్చాయి. ఆలిండియా స్థాయిలో 1368వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. జనరల్ మెడిసిన్ ఎండీ చేయాలన్నది తన లక్ష్యమని ఆమె చెప్పారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ చర్యలు

- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

నంద్యాల: వచ్చే నెల 3 నుంచి 18 వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలానీ శామూన్ అధికారులకు ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో 10వ తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10 వ తరగతికి సంబంధించి ఏర్పాటు చేస్తున్న 125 పరీక్షా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు డిప్యూటీ తహసీల్దార్‌లను ఫ్లయింగ్ స్క్వాడ్ లో నియమించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఈఓ అనురాధ, డీపీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మహేశ్వర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

మున్సిపల్ కమిషనర్‌పై కలెక్టర్ ఆగ్రహం

నంద్యాల(సిటీ): ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో తీరు మార్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిపై కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో కలియతిరిగి వివిధ డిపార్ట్‌మెంట్లలో రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ సెక్షన్‌లో పన్నుల వసూలు తీరు, ఆదాయ వివరాలపై ఆరాతీశారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాల్లో పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు సరిగా సమాధానం చెప్పకపోవడంతో చర్యలు తప్పవని హెచ్చరించారు.

నడుస్తున్న సంప్రదాయం


నిలువెత్తు భక్తి: కాళ్లకు కట్టెలు కట్టుకుని శ్రీశైల మల్లన్న చెంతకు పయనం


శివోహం: టీ షర్టులపై శివుని ప్రతిరూపం


అన్నదాన సేవ: నడక దారిలో కన్నడిగుల ఆకలి తీరుస్తున్న దాతలు


వైద్య సాయం: ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి మాత్రలు అందజేస్తున్న దృశ్యం


అడుగడుగునా ఆధ్యాత్మికం రథాన్ని లాక్కుంటూ వెళ్తున్న కన్నడిగులు

ఉగాది బ్రహ్మోత్సవాలకు కన్నడిగులు తరలివెళ్తున్నారు. ఆనవాయితీ ప్రకారం ఇంటి ఆడపడచు శ్రీశైల భ్రామరీకి పసుపు, కుంకుమ సారె సమర్పించేందుకు పాదయాత్రగా బయలుదేరారు. ఆదుకో మల్లయ్య, చేదుకో మల్లయ్యా.. హోత్ర మల్లయ్యా అంటూ ముందుకు సాగుతున్నారు. వీరికోసం పలువురు దారిపొడవునా అన్నదాన, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


అశ్వ సవారీ.. శ్రీగిరి వైపు దారి


వడివడిగా..కలివిడిగా: ఎండను సైతం లెక్క చేయకుండా కాలినడకన వెళ్తున్న భక్తులు


రయ్యిరయ్యిన: వాహనాల్లో శ్రీశైలం వెళ్తున్న కర్టాటక భక్తులు


కావడితో.. ముక్కంటి సన్నిధికి

- పాదయాత్రలో ఉట్టి పడుతున్న వీర శైవం
- శ్రీశైలానికి పసుపు, కుంకుమలతో తరలివస్తున్న కన్నడిగులు
- అడుగడుగునా అన్నదానాలు ఏర్పాటు

భక్తిభావం..విభిన్న రూపం

ఆత్మకూరురూరల్: వందల సంవత్సరాలుగా ఉగాది బ్రహ్మోత్సవాలకు ఆడపడచు భ్రమరాంబాదేవికి పసుపుకుంకుమతో శ్రీశైలం పాదయాత్రగా చేరుకోవడం కన్నడిగులకు ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా ఉత్తర కర్ణాటకలోని రాయచూరు, కొప్పల్, బీదర్, బీజాపూర్, బెలగావి మహారాష్ట్రలోని షోలాపూర్, కొల్హాపురి, జమఖండి తదితర ప్రాంతాల నుంచి అధిక మంది వస్తుంటారు. వీరిలో కొందరు పొడవాటి కర్రలను కాళ్లకు కట్టుకుని వాటిని బ్యాలెన్స్ చేస్తూ వందలాది కిలోమీటర్ల నుంచి నడిచి వస్తుంటారు. వీటిని మరగాళ్లు అని పిలుస్తారు. అలాగే, చిన్న పల్లకీ లాంటి చెక్క నిర్మాణానికి పూజలు చేసి వాటిని భుజాన ధరించి మరికొందరు నడుస్తుంటారు. వీటిని కంబిలు అని పిలుస్తారు. ఇక ఎత్తైన వెదురు బొంగులకు అలంకారం చేసుకుని వచ్చే వారు మరి కొందరు. వీటిని నంది కోలుగా పిలుస్తారు.అరుదుగా కొందరు దీర్ఘ నమస్కార అనే పద్ధతిలో వస్తారు. ఇది సామాన్యంగా గ్రామంలో ఇంటి నుంచి ఆలయం వరకు చేస్తుంటారు. కానీ కొందరు మహిళలు ఏకంగా వందలాది కిలోమీటర్ల నుంచి ఈ పద్ధతిలో శ్రీశైల సన్నిధికి వస్తుంటారు. మరికొందరు ఒక బారెడు పొడవున్న వెదురు బద్దను రెండు హస్తాల మధ్య ఉంచుకుని సాష్టాంగ నమస్కారాలు చేసుకుంటూ, ఇంకొందరు తప్పెట్లు తాళాలతో, అఖండ దీపాలను మోస్తూ ఇలా వివిధ రూపాల్లో ముందుకు సాగుతారు. తిరుగు ప్రయాణంలో ఆత్మకూరు పట్టణంలో పట్టుడు కర్రలు, చేటలు వంటి వాటిని కొనుగోలు చేసి తీసుకువెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

అడుగడుగునా అన్నదానం

లక్షలాదిగా కదలి వచ్చే కన్నడ పాదయాత్రికులకు దారి పొడవునా అన్నదాన వితరణ జరుగుతోంది.ఆత్మకూరు మండలం క్రిష్ణాపురం వద్ద కర్నూలుకు చెందిన విశ్రాంత ఉద్యోగుల సంఘానికి చెందిన బి. మోహన్ సింగ్, రంగారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన శిబిరం ఏర్పాటైంది. అలాగే ఎస్ఆర్‌బీసీ కాలనీ, ఆత్మకూరు జగద్గురు మఠం, వెంకటాపురం, నాగలూటి వీరభద్ర స్వామి ఆలయ సమీపాల్లో మహారాష్ట్ర ఇచ్చలకరంజికి చెందిన భక్తులు, పెచ్చెర్వులో, భీముని కొలను, కైలాసద్వారం వరకు పలువురు దాతలు అన్నదాన శిబిరాలు, నీరు, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు.



విద్యుత్ పనులు సకాలంలో పూర్తి చేయండి

- అధికారులను ఆదేశించిన ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ పనులు సకాలంలో పూర్తి చేసి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆ శాఖ అధికారులను కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. వివిధ విభాగాలకు పనులు మంజూరు చేశామని, వాటిని సకాలంలో పూర్తి చేయకపోతే కొత్తవి మంజూరు కావనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. పాత వర్క్ ఆర్డర్లను పూర్తి చేసేందుకు ఎగ్జిక్యూటివ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. నెలవారీ విద్యుత్ బిల్లులు 100 శాతం వసూలయ్యేలా చూడాలన్నారు.

జిల్లా ట్రెజరీలో వార్షిక తనిఖీలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీలో వార్షిక తనిఖీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఈ నెల 19 వరకు తనిఖీలు కొనసాగుతాయి. ఖజానా శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు డైరెక్టరేట్‌లోని ఏటీవో సోమయాజులు, ఎస్‌టీవోలు జహీర్, బ్రహ్మయ్య, సూర్యనారాయణ, సీనియర్ అకౌంటెంటు ఉదయ్‌కుమార్‌లు వార్షిక తనిఖీ నిర్వహిస్తున్నారు. జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు ఆదేశాల మేరకు ఏటీవో జయలక్ష్మి, ఎస్టాబ్లిష్‌మెంటు ఎస్‌టీవో పలనాటి సునీల్, అన్ని విభాగాల ఎస్‌టీవోలు వార్షిక తనిఖీలకు సహకరిస్తున్నారు. సబ్ ట్రెజరీ అధికారులు రికార్డులను తనిఖీ అధికారులు సమర్పించారు. పీడీ ఖాతాల నిర్వహణ, పెన్షన్ పేమెంట్లు, జమలు, సీపీఎస్, జీపీఎఫ్, స్ట్రాంగ్‌రూము తదితర వాటిని పరిశీలిస్తున్నారు. చివరి రోజున డైరెక్టర్ మోహన్‌రావు తనిఖీ వివరాలను పరిశీలిస్తారు.

చోరీ కేసులో దొంగలు అరెస్టు


మీసాల పరుశురాం


రెడ్డిపోగు చంద్రశేఖర్


సంగం విజయ్‌కుమార్

కర్నూలు: బుధవారపేటలో నివాసముంటున్న ఖలీల్ ఇంట్లో చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు దొంగలను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. ఖలీల్ క్రిష్ణానగర్‌లో చికెన్ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగా గత నెల 21వ తేదీ తెల్లవారుజామున ఇంటి తలుపులు దగ్గరకు వేసి కబేళాకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు నగలు, 30 తులాల వెండి నగలు మూటగట్టుకుని ఉడాయించారు. గంట తర్వాత ఖలీల్ ఇంటికి వచ్చేసరికి తలుపులు పూర్తిగా తెరిచి ఉన్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలిస్తుండగా బుధవారపేట నుంచి వన్‌టౌన్‌కు వెళ్లే రస్తాలో ఉన్న హంద్రీ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా కనిపించిన కల్లూరుకు చెందిన మీసాల పరుశురాం, బుధవారపేటకు చెందిన రెడ్డిపోగు చంద్రశేఖర్, సంగం విజయ్ కుమార్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని బుధవారం అదుపులోకి తీసుకుని విచారించగా ఖలీల్ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షలు విలువ చేసే నాలుగున్నర తులాల బంగారు నగలు, 30 తులాల వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తబ్రేజ్ తెలిపారు.

ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు

నంద్యాల(రూరల్): ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ విద్యార్థులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పోలూరు జిల్లా పరిషత్ ఉన్నతా పాఠశాలను ఆమె తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురికాకూడదన్నారు. అలాగే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, అప్పుడే చదువులో రాణిస్తారన్నారు. ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సారి ప్రతి స్కూల్‌లో వంద శాతం ఉత్తీర్ణత రావాలన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 8 మంది డిబార్

కర్నూలు సిటీ: డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఎనిమిది మంది విద్యార్థులను బుధవారం డిబార్ చేశారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు 15,685 మంది విద్యార్థులకుగాను 14,437 మంది హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

ఆదోని ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


సమావేశానికి హాజరైన అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(అగ్రికల్చర్): ఆదోని ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున చేపట్టే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. బీడు భూముల్లో చిరుధాన్యాల పంటలు సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉల్లి నిల్వ ఉంచుకునే విధంగా గోదాములు నిర్మించాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. వలసలను నివారించే విధంగా ఉపాధి పనులు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రామచంద్రయ్య, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవీ. జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామలమ్మ పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం


ప్రసంగిస్తున్న జలాలుద్దీన్ ఖాస్మి (ఇన్‌సెట్) ధార్మిక సభలో పాల్గొన్న ముస్లింలు

ఎమ్మిగనూరుటౌన్: ప్రవక్త మార్గం అనుసరణీయమైనదని ముస్లిం మతపెద్దలు అన్నారు. పట్టణంలోని గుడికల్ రోడ్డు వద్ద ఉన్న మైదానంలో బుధవారం ముస్లిం మహిళలకు, పురుషులకు వేర్వేరుగా జిల్లా స్థాయి ధార్మిక సభను నిర్వహించారు. మత పెద్దలు అబ్దుల్ బాసిత్ రియాజి, ఫజులుర్ రెహమాన్ ఉమరి, జలాలుద్దీన్ ఖాస్మి, అబు రిజ్వాన్ మొహమ్మది మాట్లాడుతూ.. దైవాన్ని ఎవరైతే స్మరిస్తారో వారికి మోక్షమార్గం లభిస్తుందన్నారు. ఇస్లాం మతం మానవత్వాన్ని నేర్పిస్తుందన్నారు. మహమ్మద్ ప్రవక్త(సల్లాలహు అలైహి వ సల్లం) చూపిన దైవ మార్గాన్ని అనుసరించాలని, అప్పుడే వారి జీవితం ధన్యమౌతుందన్నారు. పట్టణానికి చెందిన ముఖామి జమాయతే అహ్‌లేహదీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో హమ్‌దాన్ అష్రఫ్ ఫైజీ, ఏజాజ్ అహమ్మద్ నద్వి, అబ్దుల్ రహీం, అబ్దుల్ ఖదిర్ ఉమ్రీ, సాబిర్ అలీ ఉమ్రీ, మసూద్ అహమ్మద్ ఉమ్రీ మదని, జమాలుద్దీన్ ఉమ్రీ, ఇద్రీస్ ఉమ్రీ, అబుల్ వఫా ఉమ్రీ, అబుల్ సఫ మదనీ, అబ్దుల్ మొహసీ ఉమ్రీ, అబ్దుల్ రహిమా తదితరులు మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

అమ్మ పరీక్ష రాస్తోంది.. బజ్జోరా బుజ్జాయి!


షెడ్‌కు చీర కట్టి ఊయల ఊపుతున్న అవ్వ లక్ష్మి

ఆదోని అర్బన్: కోడళ్ల చదువుకు చాలా మంది అత్తలు ఒప్పుకోరు. దీంతో పెళ్లయిన తర్వాత మహిళలు చదువును మధ్యలోనే వదిలేస్తున్నారు. అయితే ఓ అత్త చదువు విలువ తెలిసి కోడలు డిగ్రీ పూర్తి చేస్తానంటే అంగీకరించింది. బుధవారం కోడలు డిగ్రీ పరీక్షలు రాస్తుండగా అత్త మనవరాలిని ఊయలలో నిద్రపుచ్చుతూ కనిపించింది. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన లక్ష్మి కుమారుడు చక్రవర్తికి రెండేళ్ల క్రితం కోసిగి మండలం సజ్జలగుడ్డానికి చెందిన ఉమాదేవి అలియాస్ పల్లవితో వివాహమైంది. వారికి ఒక యేడాది పాప ఉంది. చక్రవర్తి చిప్పగిరిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. పల్లవికి డిగ్రీ మొదటి సంవత్సరంలోనే పెళ్లి అయ్యింది. చదువు పూర్తి చేసేందుకు అత్త లక్ష్మి అంగీకరించింది. బుధవారం ఆదోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ సెమిస్టర్ పరీక్ష రాసేందుకు పల్లవి హాలులోకి వెళ్తే, కళాశాల బయట షెడ్‌కు చీర కట్టి అందులో పాపను నిద్రపుచ్చుతూ అత్త లక్ష్మి కనిపించింది.

కూలీల బ్యాంక్ ఖాతాల్లో డబ్బు మాయం

- సైబర్ నేరగాళ్ల పనే అని అనుమానం


బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను చూపుతున్న బాధితులు

హొళగుంద: బ్యాంకుకెళ్లి డబ్బు డ్రా చెయలేదు.. ఫోన్‌పే, గూగుల్‌పే వాడలేదు.. ఏటీఎం కార్డు వినియోగించలేదు.. అయినా కూలీల బ్యాంక్ ఖాతాలో డబ్బు మాయమైంది. బ్యాంకుకెళ్లి విచారిస్తే సైబర్ నేరగాళ్ల పని అయ్యుండొచ్చని తెలపడంతో బాధితులు లబోదిబోమన్నారు. హొళగుందకు చెందిన పింజరి చిణిగిసాబ్, పింజరి హుసేన్‌బీల ఎస్‌బీఐ ఖాతాల్లో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు ఒక్కొక్కరి ఖాతా నుంచి రోజూ రూ.10 వేలు ప్రకారం రూ. 60 వేలు డ్రా అయ్యాయి. విషయం తెలియక డబ్బు అవసరం కావడంతో బుధవారం చిణిగిసాబ్ ఫోన్ పే చేసేందుకు ప్రయత్నించగా అందులో బ్యాలెన్స్ లేకపోవడంతో బ్యాంకుకెళ్లి ఆరా తీశాడు. రూ.30 వేలు విడతల వారీగా డ్రా అయినట్లు తెలిసింది. దీంతో అనుమానం వచ్చి తన అక్క అయిన హుసేన్‌బీ అకౌంట్‌ను పరిశీలించాడు. ఆమె ఖాతాల్లో కూడా రోజుకు రూ.10 వేలు చొప్పున మూడు రోజుల్లో రూ.30 వేలు కస్టమర్ సర్వీస్ పాయింట్ (సీఎస్‌పీ) ద్వారా డ్రా అయినట్లు తేలింది. విషయాన్ని ఎస్‌బీఐ మేనేజర్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా సైబర్ నేరగాళ్ల పని అయ్యుండ వచ్చని, ఫిర్యాదు ఇస్తే విచారణకు పంపిస్తామన్నారు బాధితులు హొళగుంద పోలీసులను ఆశ్రయించారు. కాగా హుసేన్‌బీ, చిణిగిసాబ్ రెండు నెలల క్రితం ఆలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేలిముద్రలు వేశారని, వాటిని సైబర్ నేరగాళ్ల హ్యాక్ చేసి ఉండవచ్చని కొందరు అనుమాన వ్యక్తం చేశారు.